నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పూర్ణోదయా కాలనీ, పూర్ణోదయా కాలనీ పార్క్. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూహనుమాన్ టెంపుల్, భవానీ నగర్, ద్వారకాపురి, ప్రతాప్ నగర్, భాష్యం స్కూల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఆగస్టు నాటికి ఓటరు జాబితా సిద్ధం చేస్తాం

చాదర్‌ఘాట్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మలక్‌పేట నియోజకవర్గం ఓటరు జాబితాను ఆగస్టు నాటికి సిద్ధం చేస్తామని ఎన్నికల అధికారి డీసీ జమంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ విభాగాల నుంచి వచ్చిన బీఎల్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేసి సమర్థవంతంగా ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు.

ఉపకరణాల దరఖాస్తు గడువు పెంపు

చాదర్‌ఘాట్: అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా అందించే ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు జూలై 5 వరకు పొడిగించినట్లు డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. పలు వికలాంగుల సంఘాల విజ్ఞప్తి మేరకు జూన్ 30వ తేదీ నుంచి జూలై 5 వరకు పొడిగించినట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు టీజీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీఓటీ పద్ధతిలో టాయిలెట్ల నిర్మాణం

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌లో బీఓటీ (బ్యుల్ట్ ఆఫ్ ట్యాక్స్) పద్ధతిలో మూత్రశాలల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి తెలిపారు. మూత్రశాలల నిర్మాణానికి దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని, దాన్ని దృష్టిలో పెట్టుకొని 15 సంవత్సరాలు లీజుకు అనుమతి ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

అమిత్‌షాకు ఘన స్వాగతం



సైదాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఎయిర్‌పోర్ట్‌లో బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ప్రారంభం కోసం ఆదివారం ఆయన ఢిల్లీ నుంచి బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న సందర్భంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి మంత్రికి శాలువా కప్పి సన్మానించారు.

తొలగించిన చెట్ల కొమ్మలు తరలించాలి



హౌజింగ్ బోర్డ్ కాలనీ ఫుట్‌పాత్‌లపై చెట్ల కొమ్మలు

సైదాబాద్: విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా ఉండేందుకు ట్రాన్స్‌కో అధికారులు రహదారులకు ఇరువైపులా ఉండే చెట్ల కొమ్మలను తొలగిస్తుంటారు. అందులో భాగంగా సైదాబాద్ హౌజింగ్ బోర్డ్ కాలనీలో 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు చెట్ల కొమ్మలను తొలగించారు. అయితే తొలగించిన కొమ్మలను ట్రాన్స్‌కో సిబ్బంది కానీ, జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది కానీ ఎవరూ తొలగించ లేదు. దాంతో కాలనీలోని ఇరువైపులా రహదారులపై, ఫుట్‌పాత్‌లపై చెట్ల కొమ్మల ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది తలెత్తుతుంది. సంబంధిత అధికారులు స్పందించి తొలగించిన చెట్ల కొమ్మలు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఎన్నుకున్నారు. ఆది నరసింహారావు ప్యానల్ ప్రతినిధులు ఘన విజయం సాధించారు. అధ్యక్షుడిగా ఆది నరసింహారావు, ఉపాధ్యక్షులుగా ఈరటి రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సలుకూటి చంద్రశేఖర్‌రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీగా వడ్డెపల్లి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా డా.వేములపల్లి కృష్ణారావు, పల్లే వాణి, కార్యవర్గ సభ్యులుగా జక్క అనురాధరెడ్డి, గజ్జెల ఝాన్సీలక్ష్మీ, కందాళ యాదిరెడ్డి, కస్తూరి మురళీకృష్ణ, మల్లబోయిని మాల్యాద్రి, భత్తార్ రాఘవాచారి ఎన్నికయ్యారు.

బస్టాప్‌లో ఆక్రమణలు.. నడి రోడ్డుపై బస్సులు

● రోడ్డుపై ఆపుతున్న బస్సులు ● ప్రమాదాల బారిన ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు



స్టాప్‌కు దూరంగా నడిరోడ్డులో ఆపిన బస్సు



చైతన్యపురి మెట్రో స్టేషన్ వద్ద బస్టాప్‌లో చిరువ్యాపారాలు

చైతన్యపురి: బస్టాప్‌లో ఆటోలు, చిరువ్యాపారుల తోపుడు బండ్ల ఆక్రమణలతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బస్టాప్‌లలో ఇష్టానుసారంగా ఆటోల తిష్ట చిరువ్యాపారాలను బస్సుల కోసం ఎదురు చూసేవారు రోడ్డుపై నిలబడాల్సిన దుస్థితి నెలకొంటోంది. చైతన్యపురి, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్ బస్టాప్‌లలో ఆటోలు, తోపుడు బండి పండ్లవ్యాపారులు బస్టాప్‌లలోనే తిష్టవేస్తుండటంతో బస్సు ఎక్కే క్రమంలో ఇక్కట్లు పడుతున్నారు.

బస్టాప్‌కు దూరంగా..

బస్టాప్‌లలో స్థలం లేకపోవడంతో బస్సులు బస్టాప్‌కు దూరంగా నడి రోడ్డుపై ఆగుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట ప్రాంతాల్లో ఎక్కడా కూడా బ స్టాపుల్లో బస్సులు ఆపడం లేదు.స్టాప్‌కు పది అడుగుల దూరంలో నడిరోడ్డులో ఆపుతుండటంతో వృద్ధులు, మహిళలు బస్సు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బండ్లగూడ, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, దిల్‌సుఖ్‌నగర్ డిపోలకు చెందిన సిటీ బస్ డ్రైవర్లు ఇలా స్టాప్‌లలో బస్సులు ఆపడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కరువైన పర్యవేక్షణ..

జాతీయ రహదారి ఆనుకుని ఉన్న బస్టాపు వద్ద వ్యాపారాలు చేస్తూ ప్రయాణికులను ఇబ్బంది కలిగిస్తున్న వారిపై సంబంధిత అధికారులు కానీ.. ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తోపుడు బండ్లకు రూ.100, డీసీఎంలు, ఆటోలలో పండ్లు అమ్ముకునే వారికి రూ. 700 చలాన్లు విధిస్తున్నారు. చలాన్లు కడుతున్నాం ఇష్టానుసారంగా వ్యాపారాలు చేసుకుంటున్నాం అని చిరువ్యాపారులు ధీమాగా చెబుతున్నారు. వచ్చినప్పుడల్లా ఎంతో కొంత జరిమానా కడుతున్నామని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్టాప్‌ల వద్ద ఆక్రమణలపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి..



బస్టాప్‌ల వద్ద ఆక్రమణలతో బస్సులు నడి రోడ్డుపై ఆపుతున్నారు. మహిళలు, వృద్ధులు బస్సు ఎక్కేక్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాపుల్లో తిష్ట వేస్తున్న వ్యాపారాలను తొలగించి బస్సులు మస్సులు ఆపేలా చొరవ తీసుకోవాలి. ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించే ఆక్రమణలను నివారించేందుకు సిబ్బందిని నియమించాలి.

– ఎండీ షాదుల్లా, చైతన్యపురి

వంగూరి యాదవరెడ్డికి డాక్టరేట్



యాదవరెడ్డిని సన్మానిస్తున్న దేపభాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కే పురం డివిజన్‌కు చెందిన ప్రముఖ హ్యూమనిస్ట్ వంగూరి యాదవరెడ్డి ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌవర డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి నివాసానికి ఆదివారం యాదవరెడ్డి రాగా ఆయనను సన్మానించారు. నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి అకాడమీ అధినేత చెన్నారెడ్డి చేతుల మీదుగా యాదవరెడ్డి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. వంగూరి యాదవ రెడ్డి సేవా దృక్పథం, ప్రజల పట్ల నిబద్ధత, విలువలతో కూడిన జీవనశైలి ఆయనను ఈ గౌరవానికి అర్హుడిగా చేశాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, వెంకటేష్ గుప్తా, సురేష్, తలాటి రమేష్ నేత, రామకృష్ణ గౌడ్, లింగస్వామి గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఈస్ట్ హైదరాబాద్ క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశం

మలక్‌పేట: ఈస్ట్ హైదరాబాద్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న మలక్‌పేట రాక్‌చర్చిలో పాస్టర్స్, క్రిస్టియన్ లీడర్స్ సమావేశం జరుగుతుందని జనరల్ సెక్రటరీ జి.సాల్మన్‌రాజ్ తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ బోడా సాల్మన్, ఏపీ హైకోర్టు అడ్వకేట్ బ్రదర్ టీ.ప్రభుదాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగే సమావేశంలో భారీ సంఖ్యలో హాజరవ్వాలన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.25, వంకాయ రూ.28, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.37, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.26, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, కీర రూ.40, బీన్స్ రూ.85, క్యాప్సికమ్ రూ.60. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



గుంతలుగా మారిన వనస్థలిపురం మీసేవ కేంద్రానికి వెళ్లే దారి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల రోడ్లు అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ధ్వంసమైన రోడ్ల గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని ఆయా కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఏర్పడి గుంతలతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలో రోడ్లపై భారీ గుంతలు ఏర్పడటంతో వర్షం వచ్చినప్పుడు నీరు గుంతల్లో నిండి కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వనస్థలిపురంలోని మీ సేవాకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని స్థానికులు వాపోతున్నారు.

మరమ్మతు పనులు చేపట్టాలి

అధికారులు తమ కమిషన్ల కోసం వేసిన రోడ్లనే మళ్లీ మళ్లీ వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దశాబ్ద కాలం కింద వేసిన రోడ్ల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని కాలనీ వాసులు పర్కొంటున్నారు. బాగున్న రోడ్లనే అభివృద్ధి పనుల పేరుతో ఏడాది రెండు సార్లు తవ్వి వేస్తున్నారని..అంతర్గత రోడ్లను పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు. ధ్వంసమైన రోడ్లపై రాకపోకలు సాగించే దుస్థితి లేదని వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే పలు చోట్ల స్థానికులు పైప్‌లైన్ల కోసం తవ్వి వదిలేస్తున్నారని కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంస్కృతి, ప్రకృతిని కాపాడుకోవాలి

ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

నాగోలు: మన సంస్కృతి, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా జై గణేష్ భక్తి సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయరంగా పేర్కొన్నారు. హిందూ పండుగలను ప్లాస్టిక్ రహిత, పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు. జై గణేష్ భక్తి సమితి ఆధ్వర్యంలో కొత్తపేటలో డాక్టర్ విజయరంగ అధ్యక్షతన ఆదివారం జై గణేష్ ఉత్సవ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జై గణేష్ భక్తి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జైన్‌కుమార్, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, సాయిబాబా ఆలయ కమిటీ సలహాదారులు వనం యాదయ్యతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మట్టి వినాయక విగ్రహాలు పెట్టాలని, ప్లాస్టిక్ నివారణ, కాలనీల్లో పండ్ల మొక్కలు పెంచడం మా సంస్థ ముఖ్య లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జంగయ్య యాదవ్, వరప్రసాద్, సురేందర్, కృష్ణ, మోహన్‌రెడ్డి, కర్ణ శ్రీనివాస్‌రావు, కొత్తపేట రేణుకుంట శ్రీనివాస్, కందుకూరి శ్రీనివాస్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

మన్సూరాబాద్: డివిజన్ పరిధి శ్రీరామహిల్స్ కాలనీ కమ్యూనిటీహాల్లో భీమా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 60 మందికి పైగా దాతలు రక్తాదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, నిర్వాహకులు గంటా సతీష్‌కుమార్, రవికుమార్, శేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్: డివిజన్‌లో నెలకొన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో త్రిఫేజ్ విద్యుత్, వీధి దీపాలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా సమస్యల గురించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. వినతి ఇచ్చిన వారిలో రాజుగౌడ్, రామయ్య, మధుసూధన్‌రెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో.. ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీల్లోని సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధుల ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం కమలానగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనారోగ్యానికి గురైతే ఆందోళనతో ఇద్దరు, ముగ్గురు వైద్యుల వద్దకు వెళ్లడం సహజమని.. అలాగే కాలనీవాసులు రిజిస్ట్రేషన్ల నిలుపుదలపై ఆందోళన వ్యక్తం చేస్తూ పలువురు నాయకులను సంప్రదించడం సహజమేనని అన్నారు. రిజిస్ట్రేషన్ల సమస్యపై రెండు రోజుల్లో ఆర్డర్ వస్తుందని, దానిని కలెక్ట్ చేసుకోమని కాలనీవాసులకు చెప్పడం జరిగిందని, కానీ కొందరు సోషల్ మీడియాలో తామే ఆర్డర్ తీసుకువచ్చామని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. అలాగే కాలనీలోని మహిళా సంక్షేమ భవనం నిర్మాణానికి, ప్రాపర్టీ ట్యాక్స్ తగ్గింపునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిట్టా రాజశేఖర్‌రెడ్డి, టీ.వీ.రావు, సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు, మల్లికార్జున్, వేణుగౌడ్, ఉపేందర్‌రెడ్డి, నాయకులు సత్తిరెడ్డి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలల సంక్షేమమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న అజయ్ కార్తీక్

చంపాపేట: రాష్ట్రంలోని బాలల హక్కుల సాధన, సంక్షేమమే చైల్డ్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఫోరం లక్ష్యమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, ఫోరం అధ్యక్షుడు అజయ్ కార్తీక్ అన్నారు. ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ఎస్ఆర్‌డీజీ ఉన్నత పాఠశాలలో ఫోరం కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుకోవాలని ఆసక్తి ఉండి చదువుకు దూరంగా ఉన్న పేద పిల్లలను బడిబాట పట్టించేందుకు ఫోరం సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రాజ్యాంగంలో బాలల కోసం కల్పించిన హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఫోరాన్ని గ్రామీణ, మండల స్థాయినుంచి బలోపేతం చేసి బాలల హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఫోరం కార్యవర్గ సభ్యుల నియామక ఉత్తర్వులు జారీ చేసి అందచేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ఎండీ ఇస్మాయిల్, వైవీరావు, మాధవి, అనిత, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రథయాత్రతో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



రథయాత్రలో పాల్గొన్న లింగాల హరిగౌడ్, లెనిన్ బాబు

సైదాబాద్: భక్తిశ్రద్ధలతో నిర్వహించే దైవకార్యాలు అందరిలో ఐకమత్యాన్ని కలిగిస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆస్మాన్‌గఢ్ చౌరస్తా నుంచి సైదాబాద్ కాలనీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో ఆయన పాల్గొన్నారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై దేవతా మూర్తులను ఉంచి భక్తిపారవశ్యంతో అందరూ రథాన్ని లాగారు. అందరూ భక్తి గీతాలు ఆలపిస్తూ సాగిన రథయాత్రతో సైదాబాద్ పురవీధులలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ.. జగన్నాథుడి రథయాత్ర ప్రపంచ ప్రసిద్ధిని గాంచిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు లెనిన బాబు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ పాలన ప్రజలకు తెలిపేందుకే సదస్సులు

బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



హస్తినాపురం: ఇందిరాగాంధీ ప్రధానిగా ఉండి ఎమర్జెన్సీ విధించి నిరంకుశపాలన కొనసాగించారని ఎమర్జెన్సీ పెట్టి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పాలన గురించి ప్రజలకు తెలిపేందుకే సదస్సులు నిర్వహిస్తున్నామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి హస్తినాపురంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, రాజ్‌నాథ్‌సింగ్, నరేంద్రమోదీ, ఎంతో మంది నాయకులు ఆర్‌ఎస్‌ఎస్, జనశక్తి కార్యకర్తలు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడారన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఏ ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇవ్వలేదని నరేంద్రమోదీ ప్రభుత్వం బాబాసాహెబ్ అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ చేసింది భారత్ జోడో యాత్ర కాదని, అది భారత్ తోడో యాత్ర అని ఎద్దేవా చేశారు. విశ్వామిత్ర, విద్యాసాగర్‌రెడ్డి, సుకుమార్, భూపతిరెడ్డి, సామరంగారెడ్డి, నర్సింహారెడ్డి, లచ్చిరెడ్డి, ఎరుకల మల్లేశ్‌గౌడ్, నరేశ్‌యాదవ్, దెంది రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఇరుకు దారి.. ఇబ్బందిగా మారి.!

రహదారుల్లో అక్రమ పార్కింగ్
- సెట్ బ్యాక్ లేకుండా భారీ భవనాల నిర్మాణాలు
- కుంచించుకుపోతున్న రోడ్లు
- రాకపోకలకు ఇబ్బందులు



దుర్గాభవానీనగర్ భాష్యం స్కూల్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్

చంపాపేట: అసలే ఇరుకు రహదారులు..ఆపై రోడ్ల ఆక్రమణలు..దానికి తోడు అక్రమ వాహనాల పార్కింగ్‌లు, సెట్ బ్యాక్ నిబంధనలు తుంగలో తొక్కి బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు...వెరసి చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీవాసుల నిత్యం రద్దీతో ఉన్న రహదారులపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చంపాపేట పాతబస్తీలో సుల్తానాఅల్వా, కటకోని కుంట, నెహ్రూనగర్, రెడ్డి బస్తీ, మహంకాళమ్మతోట, హరిజన బస్తీ, కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని శుభోదయ, కుమ్మరి బస్తీ వంటి పలు కాలనీలలో ప్రధాన రహదారులన్నీ 10 నుంచి 15, 20 అడుగుల వెడల్పుతో ఇరుకై న రహదారుల మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ఆయా కాలనీలలో సెట్ బ్యాక్ నిబంధనలు లేని నూతన బహుళ అంతస్తు భవానాలే లెక్కకు మించి ఉన్నాయి. దుర్గాభవానీనగర్, మారుతీనగర్, యాదగిరినగర్ వంటి పలు కాలనీలు సంతోషనగర్ ప్రధాన రహదారికి సమీపంలో ఉండటంతో ఆయా కాలనీవాసులు తమ భవనాలను హాస్టళ్లకు అద్దెకు ఇవ్వటంతో రాత్రింబవళ్లు ఆయా కాలనీల రహదారుల ఇరుపక్కల వాహనాల పార్కింగ్, విద్యార్థుల రాకపోకలతో ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతోంది.

ట్రాఫిక్‌జామ్‌లో అంబులెన్స్

ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా కాలనీ రహదారుల మీదుగా ప్రయాణించటం నరకం చూడాల్సిందే అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల క్రితం అనారోగ్యంతో ఉన్న రోగిని అంబులెన్స్‌లో డీఎంఆర్‌ఎల్ చౌరస్తాలోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా దుర్గాభవానీనగర్ కాలనీలోని భాష్యం స్కూల్ పాఠశాల వద్ద అక్రమ పార్కింగ్‌తో రెండు గంటల పాటు ఇరుక్కున్న అంబులెన్స్‌లోని రోగి ఆరోగ్య పరిస్థితి మరింత విష మించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సెట్‌బ్యాక్, బహుళ అంతస్తుల భవనాల చుట్టూ విశాలమైన ఖాళీ స్థలం లేని ఇరుకైన భవనాలలో హాస్టళ్ల ఏర్పాటు చేస్తున్నారని అలాంటి భవనాల్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే ఫైర్ ఇంజిన్ వెళ్లేందుకు కూడా మార్గం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు ఇలా..

రోడ్లపై వ్యాపారాలతో..

అసలే ఇరుకై న రహదారిపై ఇరువైపులా అక్రమ పర్కింగ్ ఇది చాలదన్నట్లు వాహనాల ముందు ఉన్న రోడ్డునూ ఆక్రమించి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టీ స్టాల్స్, కూరగాయల దుకాణాలు, పండ్ల తోపుడు బండ్లు ఏర్పాటు చేస్తుండటంతో ఆయా కాలనీలలో నడకే నరకప్రాయంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంపాపేట చౌరస్తాలో మూడు దశాబ్దాల క్రితం పురాతన భవనంలో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చే వారు తమ వాహనాలను నడిరోడ్డుపై పార్కింగ్ చేస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించే వారు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి అక్రమ పార్కింగ్‌పై దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి..



చంపాపేట పరిధి మారుతీనగర్, యాదగిరినగర్, దుర్గాభవానీనగర్ కాలనీలు గతంలో ప్రశాంతంగా ఉండేవి. కొందరు అద్దెలకు ఆశపడి సెట్ బ్యాక్ లేకుండా బహుళ అంతస్తులు నిర్మించి హాస్టళ్లు, భారీ వ్యాపార కేంద్రాలు, గోదాములకు అద్దెకు ఇస్తున్నారు. వాళ్ల వాహనాలు రోడ్లపై పార్కింగ్‌లు చేస్తుండటంతో కాలనీలోకి అడుగు పెట్టలేని దుస్థితి ఏర్పడుతుంది.

– చందు యాదవ్, సాయిరాంనగర్

ఫిర్యాదు చేసినా స్పందన కరువు..



సుల్తానాఅల్వా కాలనీ అంతర్గత రహదారులన్నీ 10, 15 అడుగుల వెడల్పుతో ఉన్నాయి. కాలనీలోని ఇళ్ల నిర్మాణదారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఇరుకై న రహదారులు కాస్తా మరింత ఇరుకుగా మారుతున్నాయి. కనీసం కొన్ని రహదారులలో ఆటో కూడా వెళ్లలేని దుస్థితి ఉంటుంది. ఈ విషయంపై పలుమార్లు సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

– దొబ్బ శ్రీనివాస్, సుల్తానాఅల్వా కాలనీ